క్లుప్తంగా

మాజీ సీఎం జగన్‌ను కలసిన ఎంపీపీ



తాడేపల్లిలో మాజీ సీఎం జగన్‌ను కలసిన ఎంపీపీ కాంతి సుధాకర్

ప్రత్తిపాడు: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రత్తిపాడు ఎంపీపీ గోళ్ల కాంతిసుధాకర్ శనివారం కలిసారు. తాడేపల్లిలోని క్యాంపు ఆఫీసులో జగన్‌ను కలిసి నియోజకవర్గంలో రాజకీయాలను వివరించారు. నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబుతో కలిసి పనిచేయాలని జగన్ తనకు సూచించినట్టు ఎంపీపీ తెలిపారు.

హలో దళిత్..చలో అమరావతి కరపత్రాల ఆవిష్కరణ

రౌతులపూడి: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 19న నిర్వహించే హలో దళిత్...చలో అమరావతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దళిత బహుజన పార్టీ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్ పిలుపునిచ్చారు. రౌతులపూడి ఎస్సీ కాలనీలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం దళిత నేతలతో ఆయన సమావేశం నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హలో దళిత్..చలో అమరావతి బహిరంగ సభ కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో దళిత నాయకులు దాసరి అన్నపూర్ణ, కొండేటి శివాజీప్రసాద్, స్థానిక నాయకులు ఇనకోటి కిరణ్, కర్రి రమేష్‌కుమార్, పులి రాజుబాబు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహాల ఆవిష్కరణ



తునిలో అంబేడ్కర్, రాధాకృష్ణన్ విగ్రహాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

తుని: స్థానిక రాజా ప్రభుత్వ హైస్కూల్‌లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మొదటి ఉప రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాలను శనివారం ఆవిష్కరించారు. హైస్కూల్ విశ్రాంత ఉపాధ్యాయులు తమాదాల శేషగిరి ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన ఈ విగ్రహాలను పట్టణ ప్రముఖులు ఆవిష్కరించారు. విద్యార్థులకు దేశనాయకుల గొప్పదనం, వారి త్యాగనిరతిని తెలియజేయాలనే లక్ష్యంతోనే విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు దాత శేషగిరి తెలిపారు. పట్టణ ప్రముఖులు, ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కార్మికుల ఆందోళనలు



చిన్నింపేట జీడిపిక్కల ఫ్యాక్టరీ వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

ఏలేశ్వరం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని చిన్నింపేట జీడిపిక్కల ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికుల చేస్తున్న ఆందోళనలు శనివారం కొనసాగాయి. ఫ్యాక్టరీ మెయిన్ గేట్ వద్ద కార్మికులు నిరసన తెలుపుతూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫ్యాక్టరీ మూసివేతతో 409 మంది కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. యాజమాన్యం తమకు న్యాయం చేయాలన్నారు. ప్రభుత్వం మూసివేసిన ఫ్యాక్టరీని వెంటనే తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు వీరబాబు, చక్రధర్, గోవిందు, ధర్మాజీ, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

ప్రత్తిపాడు: స్థానిక మినర్వా డిగ్రీ కళాశాలలో శనివారం పెద్దాపురం రోటరీ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని మినర్వా వ్యవస్థాపకు డీవీఎస్ రమేష్‌రాజు ప్రారంభించారు. 50 మంది ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.హరిబాబు, ఎం.లక్ష్మణ్‌కుమార్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

మండల అధికారుల నంబర్లు

ఏలేశ్వరం:	
తహసీల్దార్	- 98499 03921
ఎండీపీఓ కార్యాలయం	- 98493 36599
ఎంఈఓ	- 94942 10420
ఏపీఓ	- 70939 98217
ఏపీఎం	- 73373 16825
ఎస్సై	- 94409 04835
మండల వైద్యాధికారి	- 99662 06287
నగర పంచాయతీ కమిషనర్	- 96520 65430
మండల వ్యవసాయాధికారి	- 83310 56609
ఫారెస్టు రేంజర్	- 94403 28540
కిర్లంపూడి:	
తహసీల్దార్	- 98499 03886
ఎంపీడీఓ	- 91009 70617
ఎంఈఓ	- 90009 12335
ఎంఈఓ-2	- 98487 43433



ఏలేశ్వరంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



గజ్జనపూడిలో శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



కత్తిపూడిలో విశేష అలంకరణలో స్వామి, అమ్మవార్లు



ప్రత్తిపాడులో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకుడు

ఈశ్వరా.. సుబ్రహ్మణ్యేశ్వరా..

- కన్నులపండువగా షష్ఠి మహోత్సవాలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ఏలేశ్వరం: సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి మహోత్సవాలు తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో శనివారం కన్నులపండువగా జరిగాయి. గ్రామాల్లో వల్లీ దేవసేన సమేత సుబ్రమణేశ్వరాస్వామి ఆలయాలకు తెలవారుజాము నుంచి భక్తులు పోటెత్తారు. పండితులు స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల పుట్టల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఏలేశ్వరం, యర్రవరం, లింగంపర్తి తదితర గ్రామాల్లో భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఏలేశ్వరం సాయిబాబా మెట్ట వద్ద సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద భక్తులు బారులు తీరారు. షష్ఠిని పురస్కరించుకుని ఆలయాల వద్ద రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. యర్రవరంలోని ఏలేరు నది ఒడ్డున స్వామివారి ఆలయంలో షష్ఠి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెద్దనాపల్లిలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారికి క్షీరాభిషేకం చేశారు.

కిర్లంపూడి మండలంలో...

కిర్లంపూడి: మండలంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. రామచంద్రపురం, క్రిష్ణవరం, రాజుపాలెం, చిల్లంగి గ్రామాల్లో వేంచేసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆయా ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. రామచంద్రపురంలో భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. రాజుపాలెంలోని సుబ్రహ్మణేశ్వరస్వామి వారిని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత తోట నరసింహం తనయుడు తోట రాంజీ దర్శించుకున్నారు.

శంఖవరం: మండలంలోని కత్తిపూడి, శంఖవరం గ్రామాల్లో వేంచేసిన సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో షష్ఠి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి భక్తులు భారీగా తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి విశేష అలంకరణ చేశారు. వందలాది మంది భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



అన్నవరంలో స్వామివారి కల్యాణం జరిపిస్తున్న పండితులు



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

ఘనంగా సుబ్బారాయుడి దివ్య కల్యాణం

అన్నవరం: స్థానిక దేవస్థానం హైస్కూల్ వద్ద వేంచేసిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. పండితులు తెల్లవారుజామున రెండు గంటలకు ఆలయం తెరిచి పూజలు చేశారు. నాలుగు గంటలకు నుంచి స్వామి, అమ్మవార్లకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల దర్శనానికి భక్తులను అనుమతించారు. మధ్యాహ్నం రెండు గంటలకు స్వామి, అమ్మవార్లకు లక్ష బిల్వార్చన నిర్వహించారు. వేలసంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించారు. దేవస్థానం హైస్కూల్ కల్యాణ వేదికపై సర్వాంగసుందరంగా అలంకరించిన మండపంలో రాత్రి ఏడు గంటల నుంచి 9.30 గంటల వరకు స్వామివారి దివ్యకల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు భక్తులకు కనువిందు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించారు. పండితులు ఇంద్రగంటి నర్సింహమూర్తి, ఇంద్రగంటి వేంకటేశ్వర్లు, సుధీర్, దత్తాత్రేయ శర్మ, విశ్రాంత స్పెషల్‌గ్రేడ్ వ్రతపురోహిత సూపర్‌వైజర్ ముత్య సత్యనారాయణ, స్పెషల్‌గ్రేడ్ వ్రతపురోహిత సూపర్‌వైజర్ చామర్తి కన్నబాబు, పురోహితులు పాలంకి పట్టాభి, చెల్లపిళ్ల ప్రసాద్ తదితరులు కల్యాణం జరిపించారు.

స్వామి వారిని దర్శించుకున్న తోట రాంజీ

జగ్గంపేట: మండలంలోని కాట్రావులపల్లిలో వేంచేసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని శనివారం వైఎస్సార్ సీపీ యువ నాయకుడు తోట రాంజీ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట ఆ పార్టీ మండల అధ్యక్షుడు రావుల గణేష్ రాజా, తోట అయ్యన్న, రామకుర్తి మూర్తి తదితరులు ఉన్నారు.

ప్రత్తిపాడు: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రధానార్చకుడు కొత్తలంక సాయిశర్మ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు.

గోకవరం: మండలంలో సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. గుమ్మళ్లదొడ్డిలో శ్రీరామగిరి కొండపై వేంచేసిన శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. సాయంత్రం స్వామివారి కళ్యాణోత్సవం కన్నులపండువగా జరిగింది. కొత్తపల్లిలోని రాజుగారి తోట, కృష్ణునిపాలెం పంచాయతీ పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. దేవీపట్నం మండలంలోని ఫజుల్లాబాద్‌లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి వచ్చిన భక్తులకు కొత్తూరు శివారున లేఅవుట్‌లో తంటికొండకు చెందిన ఆకుల సత్యనారాయణ, శివరామకృష్ణ సోదరులు అన్నదానం నిర్వహించారు.

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని గజ్జనపూడిలో శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామున పండితులు స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశరుద్రాభిషేకం, ఊయల సేవ నిర్వహించారు. సాయంత్రం బాణసంచా కాల్చి శులాలు, తాడిపెద్దు సంబరాలను నిర్వహించారు. రాత్రికి స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా జరిగింది. భక్తులు స్వామి వారిని దర్శించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

బాధితురాలికి ఆర్థిక సాయం



రాచపల్లిలో బాధితురాలికి ఆర్థిక సాయం అందజేస్తున్న మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లి గ్రామానికి చెందిన చిలికోటి వీరలక్ష్మి గత కొంత కాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు శనివారం ఆమె పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ శ్రేణులు, పేదల ప్రజలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను, ఎంపీటీసీ మొల్లి వీరబాబు, నానిపల్లి చంటి, ముదునూరి సీతారామరాజు, కోలా తతబాబు, బొల్లు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కక్షిదారులకు రాజీయే రాజమార్గం

- న్యాయమూర్తి కాటం భాను



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న న్యాయమూర్తి కాటం భాను

ప్రత్తిపాడు: కక్షిదారులకు రాజీ మార్గమే రాజమార్గమని ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి కాటం భాను అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవాదులకు వివిధ కేసుల్లో మధ్యవర్తిత్వంపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి కాటం భాను మాట్లాడుతూ సమాజంలో ప్రజలు చిన్న చిన్న కేసులకు సైతం కోర్టును ఆశ్రయిస్తారన్నారు. అటువంటి కేసుల్లో కక్షిదారులకు అవగాహన కల్పించి, వారి మధ్య రాజీ కుదర్చడంలో న్యాయవాదులు ప్రముఖ పాత్ర పోషించాలన్నారు. అనంతరం మధ్యవర్తిత్వంపై న్యాయవాది ఆడారి సుగుణ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ



ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

ప్రత్తిపాడు: కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ శనివారం రాత్రి ప్రత్తిపాడు సర్కిల్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విచారణలో ఉన్న పెండింగ్ కేసులను త్వరితగతిని పూర్తి చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్టులపై ప్రజలకు అవగాహన కల్పించాలని పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరిరాజు, ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అన్నవరంలో ఐలాజ్ రాష్ట్ర మహాసభ

ప్రత్తిపాడు: ఆల్ ఇండియా లాయర్స్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) మొదటి రాష్ట్ర మహాసభను అన్నవరం శేషాద్రి సదన్‌లో ఆదివారం నిర్వహించనున్నట్టు ఐలాజ్ రాష్ట్ర అడ్‌హక్ కమిటీ కన్వీనర్ బుగత శివ తెలిపారు. ఈ మహాసభకు ఐలాజ్ జాతీయ ప్రధాన కార్యదర్శి, కర్ణాటక హైకోర్టు న్యాయవాది క్లిఫ్టన్ డి.రొజారియో, ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి ఎస్.ఏసురత్న కుమార్, ఆంధ్రా-తెలంగాణ సమన్వయకర్త వీఎస్ కృష్ణ, ఏపీసీఎల్‌సీ రాష్ట్ర అధ్యక్షుడు వి.చిట్టిబాబు, హ్యూమన్ రైట్స్ కన్వీనర్ ఏఎస్ఎస్ రాంప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. న్యాయవాదులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తొండంగి: మండలంలోని అన్నయ్యపేట విద్యుత్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో జగ్గంపేట ఈఈ వీరభద్రరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్నయ్యపేట సబ్‌స్టేషన్‌లోని పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

అరుణోదయ సభలను జయప్రదం చేయాలి

జగ్గంపేట: హైదరాబాద్‌లో ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించే అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య 50 వసంతాల సభలను జయప్రదం చేయాలని ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం రామవరం శివారులోని రంగవల్లి నగర్ ఆ సభల కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు సతీష్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గౌరీదేవి నిమజ్జనోత్సవాలు



జగపతినగరంలో గౌరీశంకరులను ఊరేగిస్తున్న భక్తులు

కిర్లంపూడి: మండలంలోని జగపతినగరం, చిల్లంగి గ్రామాల్లో గౌరీశంకరుల నిమజ్జనోత్సవాలు శనివారం కన్నులపండువగా జరిగాయి. రెండు గ్రామాల్లోనూ సుమారు 45 రోజులుగా గౌరీశంకరుల ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాలు ముగియడంతో శనివారం స్వామి, అమ్మవార్లను ఊరేగించి నిమజ్జనం చేశారు. భక్తులు ఉదయం నుంచి ఉపవాసం ఉండి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డప్పుల వాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల మధ్య గ్రామ వీధుల్లో ఊరేగించి ఏలేరు కాలువలో నిజమ్జనం చేశారు. పలువురు భక్తులు ఇళ్లలో గౌరీశంకరులకు పాన్పులు వేసి మొక్కులను చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అర్కెస్ట్రా, సాంస్కృతిక కార్యక్రమాలు, సాంఘిక నాటకాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

గౌరీశంకరులకు విశేష పూజలు

ఏలేశ్వరం: స్థానిక నెయిలిపేటలో గౌరీ శంకరుల ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కాగా శనివారం వైఎస్సార్ సీపీ నేతలు సామంతుల సూర్యకుమార్, పైల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులకు తమ వంతు సహాయ సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు కావలి శ్రీను, చందక శ్రీను, కమిటీ సభ్యులు తూమురౌతు సత్యనారాయణ, జోగా వెంకటరమణ, గణపతి, తదితరులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో గౌరీశంకరులను దర్శించుకుంటున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నూతన కార్యవర్గం ఎన్నిక



శానిటేషన్, సెక్యూరిటీ సంఘ నూతన కార్యవర్గం

తుని: స్థానిక ఏరియా ఆసుపత్రిలో పని చేస్తున్న సెక్యూరిటీ, శానిటేషన్ వర్కర్ల సంఘ నూతన అధ్యక్షుడిగా చిన్నారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో శనివారం సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ గౌరవాధ్యక్షుడిగా గొర్ల వెంకటరమణ, కార్యదర్శిగా గౌరి, సభ్యులుగా కాంతం, కమల, హరిష్, లోవరాజు, దుర్గాప్రసాద్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు సక్కెళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ సమస్యల సాధనే లక్ష్యంగా నూతన సంఘం పని చేయాలన్నారు. నూతన కమిటీని పలువురు అభినందించారు.

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి



ఏలేశ్వరంలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీఈఓ రమేష్



ధర్మవరం సమావేశంలో మాట్లాడుతున్న పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు



లచ్చిరెడ్డిపాలెం సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శివరామకృష్ణయ్య

- జిల్లా విద్యాశాఖాధికారి రమేష్
- పాఠశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్

ఏలేశ్వరం/కోటనందూరు/తుని/కిర్లంపూడి/రౌతులపూడి/జగ్గంపేట/గండేపల్లి/ ప్రత్తిపాడు/ప్రత్తిపాడు రూరల్/శంఖవరం/తొండంగి/గోకవరం: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన మెగా పేరేంట్స్, టీచర్స్ మీటింగ్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలంటే ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పాత్ర కీలకమన్నారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎంఈఓ అబ్బాయి, హెచ్ఎం లక్ష్మీతులసి, ఉపాధ్యాయులు వెన్నాశ్రీను, చినబాబు, లోవప్రసాద్ తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ఉన్నత స్థానాలకు ఎదగాలి

ప్రతి విద్యార్థి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఎంపీడీఓ శివరామకృష్ణయ్య అన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో శనివారం మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. లచ్చిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన సమావేశానికి ఎంపీడీఓ ముఖ్య అతథిగా హాజరయ్యారు. విద్యార్థుల హాజరు, ప్రగతి, వెనుక బడిన విద్యార్థులపై తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధ తదితర అంశాలపై ఆరా తీశారు. ఎంఈఓ గాడి కొండబాబు పాల్గొన్నారు.

కోటనందూరు, కిర్లంపూడి, గోకవరం మండలాల్లో..

కోటనందూరు మండలంలోని 32 పాఠశాలలు, అల్లిపూడి కేజీబీవీలో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు నిర్వహించారు. తల్లిదండ్రులకు విద్యార్థుల పురోగతి, ప్రతిభ, మార్కులు, హాజరు తదితర విషయాలు వివరించారు. పలు పాఠశాలల్లో సమావేశాలను ఎంపీడీఓ వెంకటనారాయణ, ఎంఈఓలు శ్రీనివాస్, రామశేఖర్, ఎస్సై టి.రామకృష్ణ పరిశీలించారు. గోకవరం మండలం భూపతిపాలెం గురుకుల పాఠశాలలో జరిగిన సమావేశానికి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జ్యోతుల నవీన్ కుమార్, ముస్లిం కాలనీలో ఉర్దూ పాఠశాలలో జరిగిన సమావేశానికి ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కొత్తపల్లి ఎంపీపీ పాఠశాలలో జరిగిన సమావేశాన్ని ఎంపీడీఓ గోవిందు పరిశీలించారు.

బాల్య వివాహాల నివారణపై అవగాహన

జగ్గంపేట గురుకుల పాఠశాలలో జరిగిన సమావేశానికి పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బాల్య వివాహాల నివారణ, మత్తు పదార్థాల తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీఐ వైఆర్కే శ్రీనివాస్, ప్రిన్సిపాల్ రాజకుమారి, వైస్ ప్రిన్సిపాల్ జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

గండేపల్లి మండలం మల్లేపల్లి హైస్కూల్లో జరిగిన సమావేశానికి డీఈఓ పి. రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మురారిలో ఎంపీడీఓ నాతి బుజ్జి, ఎంఈఓ కేహెచ్ నాయక్, మల్లేపల్లిలో ఎంఈఓ-2 కె వెంకటరెడ్డి ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించారు.

ప్రత్తిపాడు మండలం ధర్మవరం హైస్కూల్‌లో జరిగిన సమావేశానికి బీసీ వెల్ఫేర్ ఈడీ శ్రీనివాసరావు, డీఎస్పీ శ్రీహరిరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థులకు డ్రగ్స్ నివారణ, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రత్తిపాడు ఎస్సై లక్ష్మీకాంతం సూచించారు. ప్రత్తిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం టీచర్స్, తల్లిదండ్రులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై లక్ష్మీకాంతం మాట్లాడుతూ డ్రగ్స్ వలన కలిగే అనర్థాలను వివరించారు. విద్యార్థుల ప్రవర్తనను తల్లిదండ్రులు పరిశీలించాలన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో డ్రగ్స్ వద్దు బ్రో.. అంటూ నినాదాలు చేయించారు. కార్యక్రమంలో ఎంఈఓ 2 వై. అచ్చిరాజు, ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతిగృహం సంక్షేమాధికారి ఎం.సత్యనారాయణ, ఫిజికల్ డైరెక్టర్ దేవీకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి వెండి శఠగోపం సమర్పణ



ధర్మకర్తలకు వెండి శఠగోపం అందజేస్తున్న దాతలు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి దాతలు 25 తులాల వెండి శఠగోపం సమర్పించారు. గ్రామానికి చెందిన ముద్ద మల్లేష్ దంపతులు శనివారం ఆలయ ధర్మకర్తలకు శఠగోపాన్ని అందజేశారు. ధర్మకర్తలు కంకిపాటి జమీలు, దండెం రామకృష్ణ, పన్నీరు బాబ్జి, కీర్తి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

తొండంగి: మండల పరిధిలోని గ్రామాల్లో ఈ నెల 10 నుంచి జనవరి 7 వరకూ రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ మురార్జి శనివారం తెలిపారు. అన్ని గ్రామ సచివాలయాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకూ రెవెన్యూ యంత్రాంగం అందుబాటులో ఉంటారన్నారు. రీసర్వే, ఇతర భూసమస్యలపై రైతులు దరఖాస్తులు అందిస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.